క్లుప్తంగా

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



సీసీ రోడ్డు, కాలువల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని 29వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మంగళవారం భూమిపూజ చేశారు. దాదాపు రూ.7.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే దృష్టికి ఆ సమస్యలను స్థానికులు తీసుకురాగా, స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరయ్యేలా చొరవ చూపి, ఇప్పుడు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్ చెలికాని మురళి, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు ముగడలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

బాడంగి: మండలంలోని ముగడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అధికారులంతా హాజరు కావాలని కోరారు.

కేజీబీవీని సందర్శించిన ఎమ్మెల్యే



కుమ్మరిపేట కేజీబీవీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని కుమ్మరిపేట గ్రామ కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మంగళవారం సందర్శించారు. అక్కడి పరిసరాలు పరిశీలించడంతో పాటు ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థుల చదువు, ఆరోగ్యం వహిస్తున్న శ్రద్ధపై ఎమ్మెల్యే ఆరాతీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టాలని, అలాగే వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీవో శంబంగి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా స్తంభాల మార్పుతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



అన్నంరాజుపేటలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

సంతకవిటి: మండలంలోని మండాకురిటి పంచాయతీ పరిధిలోని అన్నంరాజుపేట గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం మంగళవారం చేపట్టారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధుల దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు సర్పంచ్ బత్తుల జ్యోతీశ్వరరావు తెలిపారు.

నేడు, రేపు నీటి సరఫరా నిలుపుదల

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని ఆరు ప్రాంతాలకు రెండు రోజుల పాటు నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. స్థానిక చీపురుపల్లి రోడ్డులోని పైపులైన్ మరమ్మతులకు గురైన కారణంగా గోపాలపురం, కొత్తవలస, తిమ్మయ్యపేట, గాయత్రికాలనీ, మల్లిఖార్జునకాలనీ, మెంటిపేట ప్రాంతాలకు బుధ, గురువారాల్లో నీటి సరఫరా ఉండదన్నారు. పైపులైన్ మరమ్మతుల అనంతరం నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.



బాడంగి: తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థిని

గిడుగు, ధ్యాన్‌చంద్ సేవలు చిరస్మరణీయం

తెలుగు వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి పురస్కరించుకుని, తెలుగు భాషా దినోత్సవం.. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో జరిగిన ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న అతిథులంతా వారిద్దరి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారి సేవలను కొనియాడారు. గ్రాంథికంలో ఉన్న తెలుగులోని వచనాన్ని వాడుక భాషలోకి తీసుకువచ్చి, నిత్యవ్యవహార భాషలోని అందం, మాధుర్యాన్ని తెలియజేసిన మహనీయుడు, గొప్పకవి గిడుగు రామ్మూర్తి అని వక్తలు ప్రశంసించారు. హాకీ క్రీడతో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ అని ఆయన గౌరవ సూచకంగా ఏటా ఇదేరోజున ప్రముఖ క్రీడాకారులు, కోచ్‌లను సత్కరించడం జరుగుతోందన్నారు. ఆయా మహానుభావులు వారి రంగాల్లో చేసిన కృషి, సేవలు ప్రశంసనీయమని, చిరస్మరణీయమని అన్నారు.

– బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్.



రాజాం సిటీ: కంచరాం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం



సంతకవిటి: మామిడిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 'అ' అక్షరం ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు



తెర్లాం: శ్రీకృష్ణదేవరాయుల ఆస్థానంలోని భువన విజయం సభలో అష్టదిగ్గజ కవుల ప్రదర్శనలో విద్యార్థులు



రాజాం: పెనుబాక పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



సంతకవిటి: సిరిపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న సిబ్బంది



వంగరలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవ ర్యాలీ



బాడంగి: బాడంగి హైస్కూల్‌లో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ



బొబ్బిలి: గొల్లపల్లి స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న సిబ్బంది, విద్యార్థులు



రేగిడి: లింగాలవలస పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

• 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



తెర్లాం: లబ్ధిదారు మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: పేద, బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం, కుమ్మరిపేట గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఓ వైపు అభివృద్ధి పనులు జోరుగా చేపడుతూనే నిరంతరాయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగేలా ఆయన రూపొందించి, అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు అందిస్తున్న ఘనత ఆయనదేనన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతీ ఇంటికి ఏదో ఒక సంక్షేమ పథకం రూపంలో లబ్ధి జరుగుతూనే ఉందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా ఆ పార్టీకి చెందిన జన్మభూమి కమిటీల సిఫార్సులు లేనిదే దక్కేవి కావన్నారు. ప్రస్తుతం కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. అప్పటి పాలనకు ఇప్పటి పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలే గమనించాలని కోరారు. ఎన్నికల వేళ టీడీపీ చెప్పే మాయమాటలు నమ్మి, భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని హితవుపలికారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించి, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు డి.రామకృష్ణ, గోపి, పార్టీ బొబ్బిలి, తెర్లాం మండలాల అధ్యక్షులు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎన్.బాబ్జీరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి. శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు సీహెచ్ సత్యనారాయణ, రమాదేవి అప్పలరాజు, జెడ్పీటీసీ లూర్థు రామారావు, ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి సాయన్నచానల్ సమస్య



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: సంతకవిటి మండలంలోని వాసుదేవపట్నం నుంచి వాల్తేరు వరకూ విస్తరించి ఉన్న సాయన్నచానల్ సమస్యను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే కంబాల జోగులు తీసుకునివెళ్లారు. మంగళవారం తాడేపల్లిగూడెంలో సీఎంని కలిసిన ఆయన సాయన్నచానల్‌ను ఆధునీకరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అలాగే రాజాం నుంచి సంతకవిటి మీదుగా కొల్లివలసకు డబుల్‌రోడ్డు నిర్మాణం, పొందూరు–సంతకవిటి డబుల్ రోడ్డు నిర్మాణం విషయం కూడా తెలియజేశానని ఎమ్మెల్యే తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



బూసాయవలసలో దోమలమందు పిచికారీ చేయిస్తున్న అధికారులు

రామభద్రపురం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తం కావాలని ఎంపీడీవో రమామణి సూచించారు. మండలంలోని బూసాయవలస, జమ్మువలస గ్రామాల్లో పలువురికి మలేరియా వ్యాధి సోకినట్లు నిర్ధారణ కాగా, అప్రమత్తమైన వైద్యారోగ్య శాఖాధికారులు, సచివాలయ కార్యదర్శులతో కలిసి ఆయా గ్రామాల్లో దోమల మందు పిచికారీ మంగళవారం చేయించారు. ఆమె మాట్లాడుతూ ఇంటితో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఖాళీ ప్రదేశాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. తాగునీటి బోరుబావులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరికతోట మలేరియా యూనిట్ అధికారి మల్లిఖార్జునరావు, బూసాయవలస సచివాలయం కార్యదర్శి పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి జయిస్తే విజయం



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మోటివేషనల్ ట్రైనీ శ్రీదేవి

రాజాం: విద్యార్థులు ఒత్తిడిని జయిస్తే పోటీ పరీక్షల్లో తప్పకుండా విజయం సాధించగలరని సారధి వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మోటివేషన్ ట్రైనీ పి.శ్రీదేవి అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని స్ఫూర్తినిచ్చే చిత్రాలను విద్యార్థులకు చూపించడంతో పాటు పేదరికం నుంచి విజయాల వైపు నడిచిన విజేతల గాథలు వివరించారు. ఓటమి నుంచి తేరుకుని, ప్రతి ఒక్కరూ విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు పి.గాయత్రి, ఇన్‌స్టాలేషన్ అధికారి ఆత్మకూరి సతీష్ల గైడెన్స్‌లోమోటివేషన్ ట్రైనింగ్ పొందుతున్నట్లు ఆమె వెల్లడించారు. అంతకుముందు జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించి, ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.ఈశ్వరరావు, రిటైర్డ్ ఎంఈఓ కె.బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఏజీఎం సందర్శన

బాడంగి: స్థానిక రైల్వే ఎత్తు ఖానా సమీపంలోని రైతు జట్టు ఎఫ్‌పీవో(ఫార్మర్స్ ప్రొడక్షన్ ఆర్గనైజేషన్)ను విజయనగరం డీసీసీబీ ఏజీఎం లక్ష్మణరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు వారు అందిస్తున్న సేవలు, పంటల సేకరణపై సిబ్బందిని ఆరాతీశారు. నాబార్డు సహాయంతో దీక్ష మహిళా వెల్ఫేర్ సంఘం నిర్వహిస్తున్న రైతు జట్టు ఎఫ్‌పీవో ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేయడం జరుగుతుందని సిబ్బంది తెలిపారు. ఆయన వెంట సిబ్బంది రోజా, శ్రీనివాస్, ధరణి, అక్షయ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 63 మంది ఎంపిక

బొబ్బిలి: స్థానిక గాయత్రి డిగ్రీ కాలేజీలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మొత్తం 63 మంది వివిధ ఉద్యోగాలకు హాజరైనట్లు కరస్పాండెంట్ టి.కృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. మొత్తం 108 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వీటిలో విశేష ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేశామని, వీరికి విశాఖలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో 60 రోజుల పాటు శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలకు పంపిస్తామన్నారు.

'ఆరోగ్యశ్రీ' పేషెంట్లకు ఇబ్బంది లేకుండా చర్యలు



ఆరోగ్యశ్రీ పేషెంట్ల నుంచి వివరాలు సేకరిస్తున్న ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ అప్పలరాజు

రాజాం: ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు చేయించుకుంటున్న పేషెంట్లకు ఆస్పత్రిల్లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ యు.అప్పలరాజు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రితో పాటు అమృత హాస్పిటల్, జీఎంఆర్ కేర్ ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ వార్డులను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆరోగ్యశ్రీ పేషెంట్లతో కాసేపు మాట్లాడారు. ఆపరేషన్లు జరుగుతున్న తీరు, కల్పిస్తున్న వసతులు, అందిస్తున్న ఆసరా డబ్బులపై వివరాలు సేకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ డి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి

• జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు

రేగిడి: ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులంతా రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని ఉనుకూరులో మీడియాతో మాట్లాడిన ఆయన జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సాగు బాగుందని, ప్రభుత్వం సకాలంలో అన్నిరకాల విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయడంతో రైతులకు వ్యవసాయం సులభతరమైందన్నారు. జిల్లాలో ఎక్కువగా సాగులో ఉన్న వరి పంటకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఊపిరి పోస్తున్నాయన్నారు. అయితే అక్కడక్కడ వరి పంటకు పట్టిన తెగుళ్లకు రసాయనిక ఎరువులు అతిగా వాడడమే కారణమని, వీటి వాడకం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఏవో జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

పక్కాగా 'జగనన్న గోరుముద్ద'



ఉంగరాడ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న గోరుముద్ద పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు సూచించారు. మంగళవారం మండలంలోని వండానపేట, గుళ్లపాడు, ఉంగరాడ గ్రామాల పాఠశాలలను సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. ఆహార పదార్థాలు రుచి, శుచి కలిగి ఉండాలని, మెనూ ప్రకారం వంటకాలు చేయాలని సిబ్బందికి సూచించారు. కాచి, చల్లార్చిన నీటిని తాగేందుకు అందుబాటులో ఉంచాలన్నారు.

లెస్సన్ ప్లాన్‌ల పంపిణీ



ఉపాధ్యాయులకు లెస్సన్ ప్లాన్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, అంబుడ్స్‌మన్ అధికారి అన్నపూర్ణ

రామభద్రపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు చేతులమీదుగా లెస్సన్ ప్లాన్‌లు మంగళవారం పంపిణీ చేశారు. వీటిని(లెస్సన్ ప్లాన్‌లు)విశాఖపట్నం, విజయనగరం జిల్లాల అంబుడ్స్‌మన్ అధికారి, సీడీసీ స్వచ్ఛంద సంస్థ అధినేత శతపతి అన్నపూర్ణమ్మ తన సొంత నిధులతో రూపొందించారని, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్న సదుద్దేశ్యంతో ఆమె చేసిన ఈ ప్రయత్నం అభినందనీయమని ఎంపీపీ అన్నారు. ఉపాధ్యాయులు కూడా చదువులో బాగా వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం కూడా విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందని, ప్రభుత్వ నిధులు వృథా కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పెంటయ్య, రామభద్రపురం, కొట్టక్కి హెచ్‌ఎంలు కె. కామేశ్వరరావు, ఆర్.భాస్కరరావు పాల్గొన్నారు.

ఎస్పీ అభినందనలు



రేగిడి ఎస్‌ఐని అవార్డుతో సత్కరిస్తున్న ఎస్పీ దీపికా పాటిల్

రేగిడి: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావుతో పాటు ఇదే స్టేషన్‌లోని మరో ఇద్దరు కానిస్టేబుళ్లను ఎస్పీ ఎం.దీపికా పాటిల్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం సత్కరించి, అభినందించారు. ఒడిశా నుంచి రాష్ట్రానికి సరఫరా అవుతున్న గంజాయితో పాటు గంజాయి స్మగ్లర్లను పట్టుకున్నందుకు గాను వారిని అవార్డులతో సన్మానించారు.